సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



అడవి సంరక్షణకు ఫైర్‌లైన్స్

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో అడవుల, జంతువుల సంరక్షణకు, అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్స్ ఏర్పాటు ద్వారా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 8లో ▸



నేటి నుంచి క్రైస్తవుల దీక్షలు

జిల్లాలో క్రైస్తవులు తపస్సు కాల దీక్షలు చేపడుతున్నారు. ఈ దీక్షలు 40 రోజుల పాటు సాగునున్నాయి. జిల్లాలో లక్ష మంది భక్తులు దీక్షలు స్వీకరిస్తున్నారు. 8లో ▸



కిటకిటలాడిన మద్ది క్షేత్రం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ప్రదక్షిణలు చేసి మొక్కులను తీర్చుకున్నారు.

న్యూస్‌రీల్

16న శ్రీవారి క్షేత్రంలో రథసప్తమి వేడుకలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఈనెల 16న రథసప్తమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథ రావు మంగళవారం చెప్పారు. అందులో భాగంగా ఆరోజు ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామి, అమ్మవార్లకు తిరువీధి సేవలను నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వేడుకల్లో పాల్గొనాలని ఈఓ కోరారు.

టీడీపీ నేత మల్లిన రాధాకృష్ణపై కేసు నమోదు

తణుకు: తణుకు ఆర్‌టీఏ కేంద్రంలో ప్రభుత్వ వైద్యుడిని దుర్భాషలాడిన ఘటనపై టీడీపీ నాయకుడు, మాజీ వార్డు కౌన్సిలర్ మల్లిన రాధాకృష్ణపై తణుకు రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్ 26న తణుకు మండలం తేతలి గ్రామంలోని ఓ రెస్టారెంట్‌లో పుట్టినరోజు వేడుకల్లో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సుంకవల్లి రామకృష్ణను టీడీపీ నాయకులు మల్లిన రాధాకృష్ణ దుర్భాషలాడాడు. గతంలో ఆసుపత్రికి వస్తే బయటకు వెళ్లిపొమ్మని తనను అన్నారని, ‘మూడు నెలలు ఆగితే తమ ప్రభుత్వం వస్తుందని, అప్పుడు మీ సంగతి తేలుస్తా’ అంటూ రాధాకృష్ణ నోటికి వచ్చినట్లు డాక్టర్‌ను దుర్భాషలాడారు. దీనిపై డాక్టర్ రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టు అనుమతితో రాధాకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తణుకు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ చెప్పారు.

జూలై 7 వరకు జీవిత పన్ను రాయితీ

జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు



భీమవరం (ప్రకాశం చౌక్): విద్యుత్ వాహనాలకు జీవిత పన్ను (లైఫ్ ట్యాక్స్) రాయితీ ఈ ఏడాది జూలై వరకు గడువు ఉందని, వాహనాల యజమానులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు కోరారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల్లో వాయు కాలుష్య నియంత్రణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలనే దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వాహనాల నుంచి కాలుష్యం తగ్గించడంపై దృష్టి పెట్టిందన్నారు. దీనిలో భాగంగా విద్యుత్‌తో నడిచే ద్విచక్రవాహనాలు, కార్లకు జీవిత పన్నులో రాయితీ ఇస్తోందన్నారు. ఈ పన్ను రాయితీ గత ఏడాది జూన్ 7వ తేదీ వరకు అమలులో ఉండగా, విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ ఏడాది జూలై 7 వరకు దీనిని పొడిగించిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న 3,982 విద్యుత్ వాహనాలు ఉన్నాయన్నారు. వాహనాల వారీగా జీవిత పన్ను రాయితీ వివరాలను ఆయన వెల్లడించారు. ద్విచక్రవాహనానికి రూ.50 వేల లోపు 9 శాతం రాయితీ, రూ.50 వేలు దాటితే 12 శాతం రాయితీ ఉందన్నారు. అలాగే కార్లకు రూ.5 లక్షల లోపు 13 శాతం, రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు 14 శాతం, రూ.10 నుంచి రూ.20 లక్షలలోపు 17 శాతం, రూ.20 లక్షలు దాటితే 18 శాతం వరకు పన్ను రాయితీ వర్తిస్తుందని వివరించారు.

ముగిసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో జనవరి 15న ప్రారంభమైన రోడ్డు భద్రత మాస ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.వీ రయ్య చౌదరి మాట్లాడుతూ మాసోత్సవాలలో వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సంస్థ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాన కార్యాలయం నుంచి డ్రైవర్లకు ఏ రకమైన సహాయం కావాలన్నా తక్షణం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో ఇంతవరకు ఫ్యాటల్ ఆక్సిడెంట్ జరగని నరసాపురం డిపోను అభినందించారు. జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లు తగిన విశ్రాంతి తీసుకుని విధులకు హాజరుకావాలని సూచించారు. పట్టణ సీఐ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలనే స్లొగన్స్ బస్సులలో ప్రదర్శించాలని కోరారు. జిల్లా డిపో స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన డ్రైవర్లను సత్కరించారు. విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వంశీకృష్ణరాజు



క్రికెట్‌లో విజేతగా నిలిచిన ఏలూరు జిల్లా జట్టు



ప్రథమస్థానం సాధించిన బ్యాడ్మింటన్ జట్టు

‘ఆడుదాం ఆంధ్ర’లో ఏలూరు జిల్లా హవా

● క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమస్థానం ● ఉత్తమ బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా వంశీ

ఏలూరు రూరల్: విశాఖపట్టణంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి పోటీల్లో ఏలూరు జిల్లా జట్లు సత్తా చాటాయి. క్రికెట్, బ్యాడ్మింటన్ విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచి జిల్లా ఖ్యాతిని నిలబెట్టాయి. మంగళవారం సాయంత్రం విశాఖలోని జీవీఎంసీ ఇండోర్‌స్టేడియంలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో ఏలూరు జిల్లా పురుషుల జట్టు ఫైనల్‌లో తిరుపతి జిల్లా జట్టుతో తలపడింది. జిల్లా క్రీడాకారులు ఆదిరెడ్డి గుణశేఖర్, ఆరేరపు వంశీకృష్ణరాజు ప్రత్యర్థి జట్టును 21–17, 16–21, 21–17 స్కోర్ల తేడాతో ఓడించి జయకేతనం ఎగురవేశారు. క్రికెట్ పోటీల్లో సైతం ఏలూరు జిల్లా జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జిల్లా పురుషుల జట్టు విశాఖపట్టణం జట్టుతో తలపడింది. మొదట బ్యాటింగ్ చేసిన విశాఖ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఏలూరు జట్టు 15.4 ఓవర్లో 4 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. విజేత జట్లు షీల్డ్, కప్‌లతో పాటు రెండు జట్లు రూ.6 లక్షల నగదు బహుమతి అందుకున్నారు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు వంశీకృష్ణరాజు ఉత్తమ క్రీడాకారుడుగా ఎంపిక కాగా, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వంశీకృష్ణరాజును దత్తత తీసుకుని ప్రత్యేక తర్ఫీదు ఇవ్వనున్నారు.

సేవకు సత్కారం

పేదల చెంతకే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్ల సేవలను గుర్తిస్తూ వరుసగా నాలుగో ఏడాదీ పురస్కారాలు అందజేసేందుకు రంగం సిద్ధమైంది. 15వ తేదీన గుంటూరు జిల్లా నుంచి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవార్డుల ప్రదానోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పదిరోజుల పాటు వేడుకలు నిర్వహించి 19,440 మంది వలంటీర్లను ప్రత్యేక అవార్డులతో సత్కరించనున్నారు.

- వరుసగా నాలుగో ఏడాది ‘వలంటీర్లకు వందనం’
- రేపు లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్
- ఉమ్మడి జిల్లాలో 19,440 వలంటీర్లకు పురస్కారాలు
- 19,047 మందికి సేవామిత్ర, 313 మందికి సేవారత్న,
- 80 మందికి సేవావజ్ర అవార్డులు
- మరో 73 మందికి ప్రత్యేక బహుమతులు
- పదిరోజుల పాటు వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు

జిల్లాల వారీగా అవార్డుల వివరాలు

జిల్లా	సేవామిత్ర	సేవారత్న	సేవావజ్ర	ప్రత్యేక బహుమతి
పశ్చిమగోదావరి	8,616	135	39	34
ఏలూరు	10,251	178	41	39



ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నానితో అవార్డులు పొందిన వలంటీర్లు (ఫైల్)

సాక్షి, భీమవరం: కులమత వర్గాలు, రాజకీయాలకు అతీతంగా అర్హుల చెంతకే ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేసే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారు. 2019 ఆగస్టు 15వ తేదీన ప్రారంభమైన వలంటీర్ వ్యవస్థ ప్రజలతో మమేకమై పారదర్శకంగా సేవలందిస్తూ దేశవ్యాప్తంగా ప్రముఖుల ప్రశంసలు అందుకుంటోంది. కరోనా మహమ్మారికి భయపడి అయిన వాళ్లే దగ్గరకు రాని సమయంలో కోవిడ్ బాధితులు కోలుకునేంత వరకు వారికి ప్రభుత్వం ద్వారా వలంటీర్లు అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఆనారోగ్యంతో ఇతర రాష్ట్రాల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల చెంతకు సైతం వెళ్లి ప్రభుత్వ సాయాన్ని అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పూర్తయిన ఎంపిక ప్రక్రియ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఇరవై వేల మంది వలంటీర్లు ఉండగా ఏడాదికి పైబడి సేవలు అందిస్తూ 19,440 మంది పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరిలో 19,047 మంది సేవామిత్ర, 313 మందికి సేవారత్న, 80 మందికి సేవావజ్ర అవార్డులు అందుకోనున్నారు. ఆయా పురస్కారాలకు సంబంధించి ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. మరోపక్క నవరత్న పథకాలతో మెరుగుపడిన ప్రజల జీవన ప్రమాణాలకు సంబంధించి ఉత్తమ వీడియోలు చిత్రీకరించిన 73 మందికి ప్రత్యేక నగదు బహుమతులు అందజేయనున్నారు. ప్రతీ మండలం/పట్టణం స్థాయిలో ఒకరు, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలో ఒకరికి చొప్పున బహుమతులు అందిస్తారు.

నిస్వార్థ సేవలకు గుర్తింపు

వలంటీర్లు నిస్వార్థంగా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ‘వలంటీర్లకు వందనం’ పేరిట గత మూడేళ్లుగా సేవా పురస్కారాలతో సత్కరిస్తోంది. వలంటీర్ల పనితీరు ఆధారంగా సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర మూడు కేటగిరీల్లో అవార్డులు అందిస్తోంది. ఏ విధమైన ఫిర్యాదులు లేకుండా ఏడాదికి పైగా సేవలందించిన వలంటీర్లను సేవా మిత్రగా, విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రతి మండలం, మున్సిపాల్టీ నుంచి ఐదుగురు చొప్పున, కార్పొరేషన్‌లో 10 మంది సేవారత్న అవార్డు అందజేస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యుత్తమ సేవలు అందించిన ఐదుగురికి సేవావజ్ర అవార్డులు అందజేస్తోంది. ఈ ఏడాది నాలుగో సారి పురస్కారాల సందర్భంగా శాలు వాలతో సత్కరించి నగదు బహుమతులతో పాటు బ్యాడ్జీలు, సర్టిఫికెట్స్ అందజేయనున్నారు. గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం నుంచి సీఎం జగన్ వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని గురువారం ప్రారంభిస్తారు. తర్వాత జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు వలంటీర్లను సత్కరించనున్నారు. రెండు జిల్లాల్లో పదిరోజులు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు



వలంటీర్లకు వందనం కార్యక్రమానికి సంబంధించి అర్హులైన వలంటీర్ల వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. అలాగే ప్రత్యేక బహుమతులకు వలంటీర్ల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు పురస్కారాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం.

– కేసీహెచ్ అప్పారావు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్, పశ్చిమగోదావరి జిల్లా

పేదరికమే అర్హతగా
సంక్షేమ లబ్ధి



ఆర్‌బీకే ప్రారంభోత్సవంలో రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్ర బోస్, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, విప్ జగ్గిరెడ్డి, ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

పెనుగొండ: కుల, మత, పార్టీలకు అతీతంగా పేదరికమే అర్హతగా సంక్షేమాన్ని అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికి దిక్సూచిగా నిలిచారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్ర బోస్ అన్నారు. మంగళవారం ఆచంట మండలంలో ఆచంట, పెనుమంచిలి, ఆచంట వేమవరం, కందరవల్లి, కోడేరు, కొడమంచిలిల్లో పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించడంతో పాటు, గ్రామాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యతనివ్వడంతో 175 నియోజకవర్గాల్లో విజయంపై ధీమాగా ఉన్నారన్నారు. విప్ చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ సామాన్యులకు సైతం ఎన్నికల్లో అవకాశం కల్పిస్తూ పేదలకు సీఎం జగన్ అండగా ఉంటున్నారన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ కాపుల ఓట్లు వైఎస్సార్ సీపీకే అధికంగా వస్తాయన్నారు. ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్ బాటలో అమలు చేయడం జరిగిందన్నారు. ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, సర్పంచ్‌లు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, బోడపాటి బుల్లియ్య, జక్కంశెట్టి చంటి, గణేషుల శేషవేణి సుబ్బారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకర ఇందిర, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతికి ఆసరా



మండపాక ఆసరా సభకు హాజరైన డ్వాక్రా మహిళలు

జిల్లాలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గత ఎన్నికల్లో డ్వాక్రా మహిళలకు ఇచ్చిన రుణమాఫీ హామీని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు విడతల్లో పూర్తి స్థాయిలో అమలు చేయడంతో మహిళల్లో ఆనందం అంతా ఇంతా కాదు. జగనన్న ప్రభుత్వంలో అందిన ఆసరా సొమ్ముతో తమ కుటుంబాలను చక్కదిద్దుకుంటున్నామని అక్కచెల్లెమ్మలు చెబుతున్నారు. మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌కే తమ మద్దతు అని ముక్తకంఠంతో చెబుతున్నారు. మంగళవారం జిల్లాలోని తణుకు నియోజకవర్గంలో ఆసరా నాలుగో విడత సంబరాలు జరిగాయి.

– తణుకు టౌన్

సంక్షేమ పథకాలతో అండగా..

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు వంటి పథకాలను అమలు చేస్తూ అండగా నిలుస్తున్నారు. పథకాల లబ్ధిని నేరుగా మహిళల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. రుణమాఫీ హామీని పూర్తి స్థాయిలో అమలు చేశారు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి

(మండపాకలో మంగళవారం జరిగిన ఆసరా కార్యక్రమంలో)



మండపాక ఆసరా సభలో మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

టైలరింగ్ షాపుతో ఉపాధి



డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. రూ.1.45 లక్షల బ్యాంక్ రుణంతో పాటు నా సొంత సొమ్ము కొంత కలిపి టైలరింగ్ షాపు పెట్టుకుని ఉపాధి పొందుతున్నా. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.14,500 రుణమాఫీ సొమ్ము అందింది. జగనన్న మేలు మరువలేం. – బొబ్బిలి విజయలక్ష్మి, మండపాక, తణుకు మండలం

పిల్లల చదువుకు ఉపయోగించా



డ్వాక్రా సంఘం ద్వారా పొందిన రుణం సొమ్మును పిల్లలకు చదువులకు ఉపయోగించాం. వైఎస్సార్ ఆసరాలో రూ.18 వేలు అందింది. గ్రూపు మొత్తానికి రూ.1.80 లక్షలు రుణం పొందాం. ఆసరా ద్వారా మాకు రుణ విముక్తి లభించింది.

– వాకలపూడి రత్నం, మండపాక, తణుకు మండలం

పాడి గేదెలతో జీవనోపాధి



డ్వాక్రా సభ్యురాలిగా వచ్చిన రుణం రూ.1.80 లక్షలతో పాడి గేదెలు కొనుగోలు చేశా. రూ.18 వేలు వైఎస్సార్ ఆసరా ద్వారా రుణమాఫీ సొమ్ము రావడంతో రుణం నుంచి విముక్తి కలిగింది. జగనన్న మళ్లీ సీఎంగా రావాలి.

– కంకటాల వెంకట రమణ, యర్రనీలిగుంట, తణుకు మండలం

అభివృద్ధి పనులపై సమాచారమివ్వండి



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు

- లేకపోతే అధికారులపై చర్యలు తప్పవు
- జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ
- ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరు (మెట్రో): జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి భాగస్వాములను చేయాలని, అలాకాకుండా సమాచారం లోపంతో వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ హెచ్చరించారు. ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మండల పరిధిలో జరిగే పలు కార్యక్రమాల్లో స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్ వంటి స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు. వివిధ శాఖల పనులకు సంబంధించి సభ్యులు లేవనెత్తిన సమస్యలపై తీసుకున్న చర్యల ను మండల స్థాయి ప్రజాప్రతినిధులకు కూడా తెలియజేయాలన్నారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలపై చైర్‌పర్సన్ స్పందిస్తూ వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము, తోటకూరగొమ్ము, దాచారం, కొయిదా గ్రామాలలో తాగునీటి సమస్యకు మంచి నీటి బోర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ పేదల ఇళ్ల పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ తన నియోజకవర్గంలో నాడు–నేడు చేపట్టిన పనులలో కొన్ని 90 శాతం పూర్తి అయ్యాయని, మిగిలినవి కూడా పూర్తి చేసి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీ సీఈవో కె.సుబ్బారావు, పశ్చిమగోదావరి డీఆర్వో నారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్లు హాజరుకాకపోతే బాయ్‌కాట్ చేస్తాం

ఏలూరు (మెట్రో): ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు, వాటిపై చర్చించేందుకు నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కలెక్టర్ హాజరుకాకపోవడం బాధాకరం అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. మంగళవారం ఏలూరులో ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి హాజరు కాని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్లపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం, జిల్లా పరిషత్ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై జరిగే సమావేశాలకు కలెక్టర్లు హాజరుకాకుంటే సర్వసభ్య సమావేశాన్ని బాయికాట్ చేస్తామన్నారు.

క్లుప్తంగా

17న జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

తణుకు అర్బన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక తణుకు సజ్జాపురంలోని ఆదిత్య స్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.శ్రీకాంత్, అధ్యక్షులు కొరు శ్రీను, చైర్మన్ అప్పలరాజు తెలిపారు. బాలురు, బాలికల జట్ల ఎంపిక ప్రక్రియలో భాగంగా క్రీడాకారులు 55 కేజీలలోపు బరువు ఉండాలని, 2008 మార్చి 19వ తేదీ తరువాత జన్మించినవారై ఉండాలని సూచించారు. అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులతో ఆరోజు ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని తెలిపారు. ఎంపికైన జట్లు గుంటూరులో నిర్వహించనున్న 33వ సబ్ జూనియర్ కబడ్డీ స్టేట్‌మీట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని వివరించారు. వివరాలకు 96424 96117 నంబరులో సంప్రదించాలని కోరారు.

బీఎస్‌ఎన్‌ఎల్‌లో ఫ్రాంఛైజీల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): బీఎస్‌ఎన్‌ఎల్‌లో త్వరలో 4జీ సేవలు ప్రారంభించనున్నందున ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఏలూరు, తణుకు టెర్రిటరీ విభాగములలో ఫ్రాంఛైజీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టెలికాం జీఎం ఎల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రాంఛైజీలు దక్కించుకున్న వారు బీఎస్ఎన్ఎల్ 4జీ సిమ్‌లు అమ్మకం, రీచార్జీ, ఎంఎస్‌పీ వంటి వ్యాపారాలు చేయాల్సి ఉంటుందన్నారు. అర్జీదారునకు కనీసం రూ.6 లక్షలు టర్నోవర్‌తో పాటు ఒక సంవత్సరం వ్యాపార అనుభవం కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 2గంటల లోపు స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో అందజేయాలని, వివరాలకు 94406 57366, 94900 22366 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అడవి సంరక్షణకు ఫైర్‌లైన్స్

- వేసవిలో అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు
- 50 కిలోమీటర్ల పరిధిలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు
- అటవీ శాఖ అధికారుల ప్రత్యేక శ్రద్ధతో తగ్గుతున్న అగ్నిప్రమాదాలు

బుట్టాయగూడెం: వేసవికాలం వచ్చిందంటే ఏటా అడవులు తగలబడిపోవడం సర్వసాధారణమైంది. దీనివల్ల వృక్ష సంపదకు, వన్యప్రాణులకు హాని కలిగే పరిస్థితులు నెలకొంటున్నాయి. అడవుల్లో అగ్ని ప్రమాదాల వల్ల వాతావరణ సమతుల్యం కూడా దెబ్బతినే ప్రమాదం నెలకొంటుందని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాల నివారణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. అటవీ సంరక్షణలో భాగంగా సుమారు 50 కిలోమీటర్ల పరిధిలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా ఫైర్ బ్లోయర్స్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో విస్తరించి ఉన్న అటవీప్రాంతం

జాతీయ అటవీ విధానం ప్రకారం మూడో వంతు భూభాగంలో చెట్లు ఉండాలి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో సుమారు 1.32 లక్షల హెక్టార్ల పరిధిలో అటవీప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో 85 శాతం పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోనే ఉందని అధికారులు చెబుతున్నారు. బుట్టాయగూడెం మండలంలో 21,879 హెక్టార్లు, పోలవరం 27,927 హెక్టార్లు, జీలుగుమిల్లి 8,903 వేలేరుపాడు 29,476, కుక్కునూరు 22,259, టి.నర్సాపురం 4384, చింతలపూడి 6,780, కామవరపుకోట 1,178, లింగపాలెం 2,119, గోపాలపురం 649, ద్వారకాతిరుమల 813, నల్లజర్ల 2,174, పెదవేగి 1332 హెక్టార్లు, ఉంగుటూరు మండలంలో 1226 హెక్టార్లలో అడవి విస్తరించి ఉన్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.




అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు తీసుకుంటున్న అటవీ సిబ్బంది



అటవీ ప్రాంతంలో ఫైర్‌లైన్స్ పనులు చేస్తున్న దృశ్యం

అడవిలో అగ్నిప్రమాదాలు ఇలా..

వేసవికాలంలో చెట్ల ఆకులు ఎక్కువగా రాలిపోతుంటాయి. అటవీప్రాంతంలోకి పశువులను తీసుకువెళ్లిన కాపరులు, తునికాకు, చింతపండు, ఇప్పపూలు, అడ్డపిక్కలు, తదితర వాటి సేకరణ కోసం వెళ్లినవారిలో ఎవరైనా అనుకోకుండా చుట్ట, సిగరెట్, బీడీ వంటివి తాగి పడేస్తే అవి ఎండిన ఆకులకు అంటుకొని మంటలు వ్యాప్తి చెంది పెద్ద మొత్తంలో అడవులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అలాగే ఆకతాయిల చేష్టల వల్ల కూడా అడవుల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. గిరిజన ప్రాంతంలో అడవుల్లో ఏటా ఏదో ఒక ప్రాంతంలో అడవికి నిప్పు రాజుకుని మంటలు చెలరేగుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.



ఫైర్ బ్లోయర్స్ ద్వారా మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

ఫైర్‌లైన్స్ ఏర్పాటు ఇలా

అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణలో భాగంగా ఫారెస్టు అధికారులు అటవీ ప్రాంతంలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తారు. అటవీ ప్రాంతంలో కాలిబాటలో ఐదు మీటర్ల వెడల్పుతో వీటిని ఏర్పాటు చేయడం జరుగుతుంది. చుట్టు పక్కల ఉన్న ఎండిన ఆకులను కాలి బాటలో పరిచి నిప్పు పెడతారు. ఒకవేళ ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి మంటలు చెలరేగినా ఈ దారివరకే మంటలు వ్యాప్తి చెంది ఆరిపోతాయి. మిగతా ప్రాంతానికి మంటలు వ్యాప్తి చెందకుండా ఫైర్‌లైన్స్ అరికడతాయి. అడవుల సంరక్షణకు ప్రతి ఏటా అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వేసవి ప్రారంభంలో ముందస్తు చర్యలు చేపడతారు. ఫైర్‌లైన్స్ ద్వారా దాదాపు 2 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయడం ద్వారా అగ్నిప్రమాదాలు రాకుండా అరికట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. అయితే పశ్చిమ ఏజెన్సీప్రాంతంలో అటవీ విస్తరణ అధికంగా ఉండటం వల్ల సుమారు 50 కిలోమీటర్లమేర ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. గత ఏడాది తీసుకున్న చర్యల వల్ల కేవలం 2 హెక్టార్లలో మాత్రమే అడవి అగ్నిప్రమాదానికి గురైందని అటవీశాఖ అధికారులు తెలిపారు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం



అడవులు, జంతువుల సంరక్షణ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ వాచర్స్ ద్వారా కృషి చేస్తున్నాం. 50 కిలీమీటర్ల పరిధిలో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా మంటలను వ్యాప్తి చెందకుండా నివారించేలా కృషి చేస్తున్నాం. అలాగే అగ్నిప్రమాదాల నివారణపై పరిసర ప్రాంత ప్రజలకు పూర్తి అవగాహన కలిగిస్తున్నాం.

– దావీదు రాజు, డీఆర్‌వో, వైల్డ్‌లైఫ్, పోలవరం

అటవీ ప్రాంతంలో ప్రత్యేక నిఘా

వేసవికాలంలో అటవీప్రాంతంలో సంభవించే అగ్నిప్రమాదాల నివారణకు రాత్రి పగలు తేడాలేకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని ఫారెస్ట్ అధికారులు చెప్తున్నారు. ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసి ఎండిన ఆకులను పరిచి అవి పూర్తిగా కాలిపోయే వరకూ కాపలా ఉంటారు. అలాగే అనుకోకుండా మంటలు వ్యాప్తి చెందితే అందుబాటులో ఉన్న సిబ్బంది ఆ మంటలను అదుపు చేస్తారు. వీటి వల్ల అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉంటాయి.

శాటిలైట్ ద్వారా సమాచారం

అటవీప్రాంతంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే వెంటనే సమాచారం అందించేందుకు అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో ఫైర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. శాటిలైట్ ద్వారా వచ్చే సమాచారాన్ని తక్షణమే అటవీశాఖ అధికారులకు సమాచారాన్ని చేరవేస్తుంది. జిల్లాలో ఎక్కడైనా అటవీప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించి మంటలు చెలరెగితే ఆ ప్రాంతానికి తక్షణమే సమాచారం అందించే వీలుంటుంది. దీనితో ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమై ఆయా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువస్తారు.



అవినీతి సామ్రాజ్యం ఏర్పాటుకు బాబు ఆరాటం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమరావతిలో రాజధాని ఏర్పాటు చేసుకొని, తన కులం వారికి ఆస్తులు కట్టబెట్టి, తరతరాలుగా ఆ ప్రాంతంలో అవినీతి సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని చంద్రబాబు ఆరాటపడుతున్నాడని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని హౌసింగ్ బోర్డులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి మూడు రాజధానుల అజెండాను తెర మీదకు తీసుకుని రావడం వల్ల అమరావతిలో చంద్రబాబు, కులవాదులు చేసిన యత్నాలు బెడిసికొట్టాయని చెప్పారు. మూడు రాజధానుల అంశం యావత్ రాష్ట్ర ప్రజల్లో ఆలోచనలు రేకెత్తించిందని, దీనిపై సీఎం జగన్‌కు అందరి మద్దతూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

పొత్తుల కోసం వెంపర్లాడుతున్న చంద్రబాబు

వైఎస్సార్‌సీపీని ఓడించలేమని స్పష్టంగా అర్థమైన చంద్రబాబు ఢిల్లీ పెద్దల కాళ్లు పట్టుకుంటూ పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని చీకటిమిల్లి ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

జనసేన వారాహి ఎక్కడ ఆగిపోయిందో ఎవరికీ అర్థం కావడం లేదని మంగరాజు ఎద్దేవా చేశారు. అలాగే ఎల్లో మీడియా రాసి ఇచ్చిన స్క్రిప్టులను షర్మిల చదువుతున్నారని, ఆమె మాటలు వినే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 175కు 175 సీట్లు రావడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు బాలకృష్ణ, ప్రసాద్, సందీప్, సునీల్‌బాబు, రత్నం, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలబడాలి

రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి వీరా మల్లికార్జునరావు

పోడూరు: చేనేత కార్మికులందరూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి వీరా మల్లికార్జునరావు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ దశాబ్దాల రాజకీయ చరిత్రలో రాష్ట్రంలో బీసీలకు ఎనలేని గుర్తింపును ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కష్టాలలో కూరుకుపోతున్న చేనేత కార్మికులను నేతన్న నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తూ జగనన్న అండగా నిలిచారన్నారు. నేతకార్మికులు ప్రతిఒక్కరూ రానున్న ఎన్నికల్లో ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మల్లికార్జునరావుతో పాటు చేనేత విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి తాళ్ల తాతారావు ఎంపీ అభ్యర్థి ఉమాబాలను కలసినవారిలో ఉన్నారు.



వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను కలసిన వీరా మల్లికార్జునరావు, తాతారావు

జేఈఈ మెయిన్ ఫలితాలలో 'శశి' ప్రభంజనం

ఉండ్రాజవరం: జేఈఈ మెయిన్–2024 ఫలితాలలో తమ విద్యార్థులు మరోసారి జాతీయ స్థాయిలో సత్తా చాటారని వేలివెన్ను శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ మంగళవారం తెలిపారు. జె.శ్రీహర్షిత్ 99.92 పర్సంటైల్, సీహెచ్.పురంధర్‌సత్య 99.91, ఎస్.నాగేశ్వర విశ్వాంత్ 99.89, పి.నితీష్ శ్రీసత్య 99.88, ఎల్.ఉదయ కిరణ్ 99.87, బి.గరిమ 99.85, ఎస్.లక్ష్మి నిష్కల్ 99.82, కేపీటీఎస్ వంశీ కృష్ణ 99.80, ఎ.యశ్వంత్ కేదార్‌కుమార్ 99.78, బి.పవన్ 99.76, డీవి.చంద్ర 99.75, ఎ.అజితేష్ 99.72, కె.సంజయ్ పవన్ 99.71, పి.నిఖిల 99.71, కేడీ కరుణ్ లక్ష్మణ్ 99.62, బి.పురంధర్ 99.55, ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి 99.52, జీఎం రంగనాథ్‌రెడ్డి 99.51 పర్సంటైల్‌తో పాటు 99 పర్సంటైల్ పైన 40 మంది, 95 పర్సంటైల్ పైన 130 మంది, 90 పర్సంటైల్ పైన 221 మంది సాధించారని రవికుమార్ తెలిపారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మిసుప్రియ అభినందించారు.



పర్సంటైల్ సాధించిన శ్రీహర్షిత్‌ను అభినందిస్తున్న శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్

సత్తా చాటిన 'శ్రీషిర్డీ సాయి' విద్యార్థులు



అత్యధిక పర్సంటైల్స్ సాధించిన విద్యార్థులతో విద్యాసంస్థల సిబ్బంది

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జేఈఈ మెయిన్స్ ఫలితాలలో రాజమహేంద్రవరం శ్రీ షిర్డీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో సత్తా చాటారని విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య మంగళవారం తెలిపారు. తమ లక్ష్యా ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న బి.తనుశ్రీ 99.9 పర్సంటైల్ సాధించగా, జె.శ్రీకర్ 99.8, సీహెచ్ భాను వెంకట దీపక్ 99.6, ఎం.తాత్విక్ సాయి, 99.4, కె.ప్రదీప్ శ్రీసత్య 99.4, బి.లక్ష్మణ్ నాయుడు 99.3 పర్సంటిల్‌తో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఆరుగురు విద్యార్థులు 99 శాతం పైగా పర్సంటైల్ సాధించగా 15 మంది 98 పైగా, 28 మంది 97 పైగా, 53 మంది 95 పైగా పర్సంటైల్ సాధించారన్నారు. విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ హాజరైన 220 మంది విద్యార్థులలో 163 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్యా అకాడమీ డీన్ చంద్రశేఖర్ అభినందించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

పాలకొల్లు అర్బన్: చింతపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె మధుసూదనరావును సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటులో భాగంగా మధుసూదనరావు పాలకొల్లు పట్టణంలోని ఎస్‌కేపీ అండ్ టీవీఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. విద్యార్థులను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు విద్యార్థులు మానసిక సంఘర్షణకు గురిచేసేలా ఆయన ప్రవర్తిస్తున్నారని మండల విద్యాశాఖాధికారి నుంచి అందిన నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటరమణ విలేకరులకు తెలిపారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు ఆర్ఆర్‌పేటకు చెందిన ఒక మహిళ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు రైల్వే ఎస్సై డీ. నర్సింహారావు తెలిపిన వివరాలివి. ఏలూరు ఆర్ఆర్‌పేట ఈదరవారి రోడ్డుకు చెందిన సంబారు కనకదుర్గ అనే మహిళ వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం పవరుపేట రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఏలూరు జీజీహెచ్‌కు మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం చేసిన అనంతరం బంధువులకు అప్పగించారు.

పూలపల్లి అపార్ట్‌మెంట్‌లో చోరీ..!

పాలకొల్లు సెంట్రల్: పూలపల్లి గ్రామంలో ఓల్డేజ్ హోమ్ సమీపంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. అపార్ట్‌మెంట్‌లోని మూడు ఫ్లాట్‌లలో ఏ నష్టం జరగలేదని, ఒక ఫ్లాట్‌లో మాత్రం చోరీ జరిగినట్లు సందేహం వ్యక్తం చేశారు. ఇంటి యజమాని హైదరాబాద్‌లో ఉన్నారని వారు వచ్చిన తరువాత వివరాలు తీసుకుని కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

జిల్లాస్థాయి చెస్ పోటీల్లో విజేతలు వీరే

భీమవరం: భీమవరం పట్టణంలోని అనసూయ చెస్ అకాడమీలో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి అండర్–7, అండర్–9 బాలల చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 30 మంది క్రీడాకారులు పాల్గొనగా అండర్–7 బాలుర విభాగంలో ఎం.ఆశ్రిత్, సీహెచ్ సాయిశ్రీహితేష్ (భీమవరం), బాలికల విభాగంలో పి.అనీ (పాలకొల్లు), డి.నిత్యకా సుబ్రహ్మణ్యం (భీమవరం) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అలాగే అండర్–9 బాలుర విభాగంలో ఇ దేవాన్ష్, బి.దక్షిత్ (భీమవరం), బాలికల విభాగంలో కె.హేశ్రిత(భీమవరం), ఎస్‌కే మనిషా (పాలకొల్లు) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజయం సాధించారు. వీరు రాష్ట్రస్థాయి అండర్–7, అండర్–9 బాలల చెస్ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ చెప్పారు. అనంతరం విజేతలకు డాక్టర్ సుజ, డాక్టర్ ఎ నర్సింహరాజు, జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ చారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



భీమవరంలో చెస్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నేటినుంచి క్రైస్తవుల దీక్షలు

- 40 రోజుల పాటు తపస్‌కాల దీక్షలు
- ఉమ్మడి పశ్చిమ జిల్లాలో లక్ష మంది దీక్షల స్వీకరణ

దెందులూరు: విశ్వవ్యాప్తంగా బుధవారం నుంచి క్రైస్తవుల తపస్‌కాల దీక్షలు ప్రారంభం కానున్నాయి. శిలువ మీద ఏసుక్రీస్తు పడిన శ్రమలు ధ్యానిస్తూ, ప్రార్థిస్తూ క్రైస్తవులు 40 రోజులపాటు కఠోర దీక్షలు చేపడతారు. ఈ దీక్షలనే తపస్‌కాల దీక్షలు అంటారు. ఆధ్యాత్మికాభివృద్ధి సత్‌ప్రవర్తన పెంపొందించుకునేందుకు ఏటా క్రైస్తవులు ఈ దీక్షలను చేపడతారు. దీక్షలు ధరించే రోజున బసవ బుధవారం అంటారు. దీక్ష ధరించే వారు వేకువ జామున చర్చిల్లో ప్రార్థనలు చేసి తరువాత వివిధ సంఘాల్లో పారీస్ క్రీస్టులు నుదిటన విబూదీ పెట్టి, మెడలో రోజరీ వేసి ప్రార్థనలు చేస్తారు. అప్పటి నుంచి వారి దీక్ష ప్రారంభించినట్లు అవుతుంది. ఆర్‌సీఎంతో పాటు ఇతర క్రైస్తవ సంఘాలు, స్వతంత్ర్య సంఘాలతో సైతం తపస్‌కాల దీక్షలను క్రైస్తవులు పాటిస్తారు.

దీక్షలకు ఆద్యుడు ఫాదర్ ఐ.మైఖేల్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అప్పటి ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి ములగడ జాన్ ప్రాత్సాహంతో 1992లో భీమవరం ఆర్‌సీఎం చర్చి పారీస్ క్రీస్టుగా ఉన్న ఫాదర్ ఐ.మైఖేల్ 9 మందితో తపస్‌కాల దీక్షలను ప్రారంభించారు. నాటి నుంచి ఏటా దీక్షలు చేపట్టేవారి సంఖ్య పెరుగుతూ ప్రస్తుతం లక్షకు పైగా క్రైస్తవులు ఏలూరు పీఠం పరిధిలో తపస్‌కాల దీక్షలను చేపడుతున్నారు.

నిబంధనలు ఇవి

దీక్ష చేపట్టినవారు కుటుంబంతో కలిసి ఉండరాదు. 40 రోజుల పాటు మాంసాహారం భుజించకూడదు. ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా చర్చిలో ప్రార్థనలు చేయాలి. శిలువ మార్గానికి విధిగా హాజరుకావాలి. ప్రతి వారంలో దీక్ష ధరించిన వారి ఇంటివద్ద సామూహిక ప్రార్థనలు జరుగుతాయి. తెలుపు, ముక్కుపొడెం రంగు దుస్తులు, నుదిట విబూది, మెడలో రోజరీ ధరిస్తారు. చెప్పులు ధరించకూడదు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి సమయంలో అల్పాహారం స్వీకరిస్తారు. దీక్ష పూర్తయిన తరువాత చర్చిలోగానీ, మరి ఏ ఇతర పుణ్యక్షేత్రంలోనైనా దీక్ష విరమిస్తారు.



దీక్షాధారులతో ఫాదర్ ఐ.మైఖేల్

ఎందరికో స్ఫూర్తిగా జీవించాలి



ఆధ్యాత్మిక సేవ గ్రామ శివారు, గిరిజన ప్రాంతాలతో పాటు మరింత విశ్వవ్యాప్తం కావాలి. ఆధ్యాత్మిక జీవితంలో గణనీయమైన అభివృద్ధి సాధించాలి. దేవుని ఆజ్ఞలు విధిగా అనుసరించాలి. ప్రతి క్రైస్తవులు మరెంతో మందికి స్ఫూర్తిగా జీవించాలి.

– ఫాదర్ పొలిమేర జయరావు, ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి

ఎంతో ప్రోత్సహించారు



పూర్వపు పీఠాధిపతి ములగడ జాన్ నన్ను ఎంతో ప్రోత్సహించారు. క్రైస్తవులు సత్‌ప్రవర్తన, ఆధ్యాత్మిక జీవితం అభివృద్ధి చెందడానికి తపస్ కాల దీక్షలు మంచి మార్గం. 1992 నుంచి ఇప్పటివరకు ఏలూరు పీఠం పరిధిలో లక్ష మందికిపైగా తపస్ కాల దీక్షలు ప్రారంభించడం పారీస్ క్రీస్టుగా నాకు ఎంతో సంతోషంగా ఉంది.

– ఫాదర్ ఐ.మైఖేల్, పారీస్ క్రీస్టు కెథ్రడల్ చర్చి

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం

తణుకు: తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన దొంగ దుర్గాభవాని సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో భర్త నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక 23వ వార్డులో చినపేట అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం దళిత నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలన్నారు. చినపేట యూత్‌ను అభినందించారు. కార్యక్రమంలో దళిత నాయకులు గంటా సుందర్‌కుమార్, ఏలేటి న్యూటన్, చిగురుపాటి రాజు, కోనా జోసెఫ్, పిల్లి మునలయ్య, ఈది రవికుమార్, పోతుల జక్రి, కొత్తపల్లి విక్టర్, ఈది రాజశేఖర్, తాళ్లూరి రాజకుమార్, కొణాల బన్ను, చినపేట యూత్ పాల్గొన్నారు.

సరోజినీ నాయుడు జీవితం ఆదర్శనీయం



విద్యార్థినులకు బిస్కెట్లు పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: తొలి మహిళా గవర్నర్, కవయిత్రి స్వర్గీయ సరోజినీ నాయుడు జీవితం విద్యార్థినులకు ఆదర్శం కావాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సరోజిని నాయుడు జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ సరోజిని నాయుడు స్వాతంత్ర్య సమరయోధురాలిగా మహిళల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. విద్యార్థినులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఇందిర, ఆకివీడు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, మోరా జ్యోతిరెడ్డి, అంబటి రమేష్, ఎండీ జక్కీ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో మెరుగైన విద్యాబోధన



నైపుణ్యాభివృద్ధిపై వివరిస్తున్న మధుభూషణరావు

భీమవరం: నైపుణ్యాభివృద్ధితో విద్యాబోధనలో నాణ్యత పెరుగుతుందని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సి.మధుభూషణరావు అన్నారు. భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓపెన్ డే, ఉద్యోగ మేళా కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భీమవరం మండలంలోని ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులను డిగ్రీ కళాశాలలకు తీసుకువచ్చి కళాశాలలోని మౌలిక సదుపాయాలను చూపించి డిగ్రీలో చేరాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 14 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీకాంతం, అధ్యాపకులు పి.అరవింద్‌స్వామి, కాకుమాని శ్రీనివాసరావు, ఎస్‌డీవీ సత్యనారాయణ, ఎల్.నర్సింహరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలి

పెనుగొండ: ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలకు నివారణతోపాటు ప్రాణాలకు భరోసా ఉంటుందని తణుకు సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వై.సంజీవ కుమార్ అన్నారు. రోడ్ సేఫ్టీ మాసోత్సవాల సందర్భంగా మంగళవారం పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల, విశ్వతేజ డిగ్రీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్, రవాణాశాఖల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. అధిక స్పీడు, అవగాహన లేని డ్రైవింగ్, ఈగో ఫీలింగ్, డ్రైవింగ్ సమయంలో సెల్ మాట్లాడడం వంటి వాటి వల్ల ప్రమాదాలకు అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. వీటిని తగ్గించుకోవాలని సంజీవకుమార్ సూచించారు. కార్యక్రమంలో ఎస్వీకేపీ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, సీనియర్ డ్రైనింగ్ డైరెక్టరు ఎంవాసు, జమ్మయ్య, ఆర్ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి జగన్ ప్రాధాన్యం

- మండపాకలో ఆసరా సంబరాలు
- రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



మండపాక గ్రామంలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు.

తణుకు టౌన్: సంక్షేమ పథకాలు కేటాయింపులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ వారి ఆర్థిక వికాసానికి తోడ్పతున్నారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో నిర్వహించిన వైఎస్సార్ అసరా నాల్గవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలకు రుణాలతో పాటు బంగారు ఆభరణాలపై తీసుకున్న రుణాలను కూడా మాఫీ చేస్తానని హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన తర్వాత రుణాలు మాఫీ చేయకుండా మోసం చేశాడని ఆరోపించారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని సుమారు 24 వేల 489 కోట్ల డ్వాక్రా మహిళల రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేశారని చెప్పారు. రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంభన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సున్నా వడ్డీ, వైఎస్సార్ అసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు వంటి పథకాల ద్వారా మహిళల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందన్నారు. తణుకు నియోకవర్గంలో వైఎస్సార్ చేయూత ద్వారా మొత్తం 5,806 డ్వాక్రా సంఘాలకు రూ. 189.12 కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వారా రూ. 65. 13 కోట్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా రూ. 27. 8 కోట్లు, జగనన్న తోడు పథకంలో రూ. 12. 72 కోట్లు మొత్తం రూ. 194 కోట్ల 80 లక్షలను మహిళల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పేదరిక స్థాయి 12 శాతం నుంచి 6 శాతానికి తగ్గిందన్నారు. విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 70 వేల కోట్లతో చేపట్టిన పలు సంస్కరణల ద్వారా విద్యా రంగాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా గ్రామీణ ప్రాంత పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేలా శిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమ పాలన ఎరగని పార్టీలు రెండు, మూడు కండువాలతో మీ ముందుకు వస్తున్నారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిని గూడూరి ఉమా బాల మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల్లో నవరత్నాల పేరుతో హామీ ఇచ్చింది 9 హామీలే అయినా వాస్తవంలో అనేక పథకాలను అమలు చేశారని చెప్పారు. ఈసందర్భంగా మహిళలు, నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు చిట్టూరి వెంకట సుబ్బారావు, ఉండవల్లి జానకి, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, మండల మహిళా అధ్యక్షురాలు చుండ్రు శ్యామల, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పీ రామరాజు, అత్తిలి మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీటీసీ కాళ్ల సన్యాసిరావు, ఎంపీడీవో డీ శ్రీలలిత, ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, డ్వాక్రా ఏపీఎం ఏ రామకృష్ణ, సర్పంచ్‌లు అడ్డా బాబు, కరిబండి రాజేష్, మండలంలోని వివిధ గ్రామాలకు డ్వాక్రా సంఘాల సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

న్యాయ సంహిత చట్టంలోని సెక్షన్ 106 రద్దు చేయాలి



సీపీఎం కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్.లక్ష్మయ్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆటో డ్రైవర్లకు ప్రమాదకరంగా ఉన్న భారత న్యాయ సంహిత చట్టంలోని సెక్షన్ 106 రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్సుపోర్ట్ వర్కర్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక సుందరయ్య భవనంలో మంగళవారం కాట్రేడ్డి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ ఐపీసీలోని సెక్షన్స్ ప్రకారం డ్రైవర్స్‌కు ప్రమాదం జరిగినప్పుడు ఉన్న అవకాశాన్ని తీసివేసి డ్రైవర్లుకు భారీ జరిమానా విధించడం, కఠిన శిక్షలు వేసే విధంగా నూతన చట్టాలను తీసుకొచ్చారని విమర్శించారు. రోడ్డు ప్రమాదాలకు ఒక్క డ్రైవర్లను బాధ్యులను చేయకూడదని, జాతీయ రహదార్ల నిర్మాణంలో అనేక లోపా లు కూడా కారణమని చెప్పారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు కర్రి నాగేశ్వరరావు, బంకురు ప్రసాద్, గాజుల నాగేశ్వరరావు, పోతు వెంకట రమణ, గాజుల నాగేశ్వరరావు, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి గుమ్మంలోకే సంక్షేమం

- అవినీతికి చెక్ పెట్టిన జగన్ ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



తణుకు మున్సిపల్ కార్యాలయం

తణుకు అర్బన్: కులం, మతం, పార్టీ తేడా లేకుండా అర్హులైతే చాలు సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటి గుమ్మంలోకి వెళ్లాలనే ప్రభుత్వ నిబంధన తూచా తప్పకుండా అమలవుతుందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం ఒక చరిత్రాత్మకమైతే ఆ సంక్షేమ పథకాలన్నీ పారదర్శకంగా అందుతున్న తీరు ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు కురిపిస్తున్నాయి. సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు అజరామరంగా నిలుస్తున్నాయి. తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరవరం మండలాలకు సంబంధించి 82 సచివాలయాలు ఉండగా, 687 మంది వార్డు, గ్రామ సెక్రటరీలు, 1050 మంది వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తున్నారు. వలంటీరు వ్యవస్థ అవినీతిరహితంగా పనిచేస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో అవినీతి అధికం



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు ఏ పథకం అందాలన్నా డబ్బుల చెల్లించాల్సిన దుస్థితి ఎదురయ్యేది. పింఛను కావాలన్నా, బియ్యం కార్డు కావాలన్నా సంబంధిత వార్డు టీడీపీ సభ్యుడికి లంచంగా డబ్బులు ఇవ్వాల్సి ఉండేది. దీంతో పేద ప్రజలు అప్పులు చేసి మరీ ఇచ్చేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. అర్హులైతే చాలు ప్రతి పథకం ఇంటిముంగిటకే వస్తుంది.

– ఎస్‌వీ జాకబ్ బాబు, విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు, తణుకు

జన్మభూమి కమిటీలను చూసి భయపడేవారు



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులను చూసి ప్రతి వార్డులోను ప్రజలు భయపడేవారు. కమిటీ సభ్యులకు లంచం రూపంలో చేయి తడిపితేనే కానీ ప్రజలకు పని అవ్వని పరిస్థితి ఉండేది. కానీ నేడు అర్హులైతే చాలు ఇంటి గుమ్మంలోకే సంక్షేమం వచ్చేస్తోంది. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డే రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

– డీజే అమూల్యారావు, రిటైర్డు ఉపాధ్యాయులు, తణుకు

అందరికీ సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: పేదలందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యం అందించడం జరుగుతుందని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆరుగొలను గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో గుర్తించిన వ్యాధులకు మందులతో పాటు అవసరమైన వారికి నెట్ వర్క్ ఆస్పత్రుల్లో ఉన్నతమైన వైద్యాన్ని అందిస్తారన్నారు. ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనేది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. సర్పంచ్ పీతల బుచ్చిబాబు, ఉప సర్పంచ్ అడపా అప్పలరాజు, సొసైటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ, ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి సీహెచ్.చంద్రరాజు, డాక్టర్లు ఏవీ.వెంకటేష్, జి.చైతన్యకిరణ్, నవీన్, టి.చందు, కాంచన, ఎంఎల్‌హెచ్‌పీలు కృపాజాకబ్, సూర్య, ఎ.సత్యవాణి, వి.తారక్, పి.రవికుమార్, ఏఎన్ఎం జి.రాజేశ్వరి, సీహెచ్.విజయనిర్మల, టి.ఝాన్సీలక్ష్మి, హెచ్‌వీ సీహెచ్.శిరోమణి, ఆరోగ్య మిత్ర డి.సుగుణ రాణి, హెల్త్ అసిస్టెంట్ వివివి.రాజు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శ్రీదేవి

అత్తిలి: బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థితికి చేరుకోవాలని తిరుపతిపురం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి చెప్పారు. మంగళవారం అత్తిలి మండలం బల్లిపాడు నెం.1 ప్రాథమిక పాఠశాలలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఆడపిల్లలు ప్రతి విషయాన్ని తమ తల్లిదండ్రులకు తెలపాలన్నారు. చిన్నారులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వరాదని, సెల్‌ఫోన్‌ల వల్ల ఎంత ఉపయోగం ఉందో అంతే చెడు ప్రభావం ఉందన్నారు. శారీరకంగా శరీరం ఎదుగుదలకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. మనం తినే ఆహారంలో ఆకుకూరలు ఉండేలా చూడాలన్నారు. ఆడపిల్లను రక్షిద్దాం-ఆడపిల్లలను ఎదగనిద్దాం- ఆడపిల్లలను చదవనిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి శ్రీనివాసు, ఉపాధ్యాయిని ఎ పద్మావతి, మహిళా సంరక్షణ అధికారిణి ఎం స్వప్నశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు సంపూర్ణ పోషకాహారం తీసుకోవాలి



భవిత సెంటర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సుబ్బారావుపేటలోని భవిత సెంటర్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మంగళవారం వైకల్యాలు నివారణ అనే అంశంపై దివ్యాంగులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం జరిగింది. వక్తలు మాట్లాడుతూ స్త్రీలు గర్భిణులుగా ఉన్న సమయంలో సంపూర్ణ పోషకాహారం తీసుకోవాలన్నారు. తరుచుగా అనుభవజ్ఞులైన వైద్యులచే పరీక్షలు చేయించుకోవాలని, వారి సూచనలు, సలహాలు పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిచ్చినవారు అవుతారని చెప్పారు. మేనరిక వివాహాలను, చిన్న వయస్సులో వివాహాలు చేసుకోకూడదని, ప్రోత్సహించవద్దని తెలిపారు. భవిత సెంటర్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక విద్య తదితర అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, సెక్రటరీ డి.సుష్మ మాధురి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బి.జ్యోతి, కుమారి, చంద్రకుమారి, అంగన్‌వాడీలు సత్యవతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ హుండీల ఆదాయం రూ.77.96 లక్షలు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారికి హుండీల ద్వారా రూ.77,96,822ల ఆదాయం సమకూరింది. 60వ వార్షిక మహోత్సవాల్లో 30 రోజుల పాటు భక్తులు అమ్మవారికి హుండీల్లో సమర్పించిన కానుకలను సోమ, మంగళవారాలు రెండు రోజుల పాటు లెక్కించారు. మొదటి రోజు రూ.63,98,749లు, రెండోరోజు రూ.13,98,073ల ఆదాయం లభించింది. ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ మాట్లాడుతూ మొత్తం ఆదాయం రూ.77,96,822లు, బంగారం 68.800 గ్రాములు, వెండి 221 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తనిఖీదారు వి.వెంకటేశ్వరరావు, ఈవోలు కర్రి శ్రీనివాస్, ఎం.అరుణ్ కుమార్, దేవస్థానం చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మకర్తలు ముత్యాల వెంకట రామారావు, చెల్లంకి నాగ శేషగిరి(గిరి), మావూరి సుందరరావు, రామాయణం సత్యనారాయణ, గోపిశెట్టి విజయలక్ష్మి, కోయ వెంకటలక్ష్మి, నీలాపు విజయ నాగలక్ష్మి, బ్యాంక్, రెవెన్యూ, పోలీస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన సర్పంచ్



జగన్నాథపురం గ్రామంలో సీసీ రోడ్లను పరిశీలిస్తున్న సర్పంచ్ చంద్రిక

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం సచివాలయం-2 పరిధిలో ఎస్సీ, బీసీ ఏరియాలో 350 మీటర్ల నిడివిలో నిర్మిస్తున్న నాలుగు సీసీ రోడ్ల పనులను మంగళవారం గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇక్కడి రోడ్ల విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.20లక్షలు మంజూరు చేసినట్లు సర్పంచ్ చంద్రిక తెలిపారు. త్వరితగతిన ఈ రోడ్లను పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆమె వెంట సచివాలయ కార్యదర్శి కే.శ్రీనివాసరెడ్డి, జడ్డు ఫణీంద్రకుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రసాద్, పీఆర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కే.నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉండ్రాజవరపు రాజు, ముప్పిడి లక్ష్మణరావు, మధు తదితరులు ఉన్నారు.

వీవీ ప్యాట్‌లతో పారదర్శకమైన ఓటింగ్



ఆరుగొలను గ్రామంలో వీవీ ప్యాట్‌లపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ

తాడేపల్లిగూడెం రూరల్: ఎన్నికల కమిషన్ నూతనంగా ప్రవేశపెట్టిన వీవీ ప్యాట్‌ల ద్వారా ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆరుగొలను గ్రామంలో ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ గతంలో ఈవీఎం ప్యాట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్న సమయంలో బీపింగ్ సౌండ్ ఒక్కటే వచ్చేదన్నారు. దీనివల్ల ఓటు ఎవరికి వెళ్తుందనే అపోహలు సైతం పార్టీలు, ప్రజల్లో ఉండేదన్నారు. వీటన్నింటికి పరిష్కారంగా వీవీ ప్యాట్‌లను ఎన్నికల కమిషన్ తీసుకొచ్చిందన్నారు. తద్వారా ఓటరు తన ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత ఏడు సెకన్లపాటు తాను ఏ గుర్తుపై ఓటు వేశాననేది వీవీ ప్యాట్ డిస్‌ప్లేలో కనిపిస్తుందన్నారు. తదుపరి ఆ స్లిప్ బాక్స్ పడుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఏదైనా అనుమానాలు ఉంటే స్లిప్‌లను తీసి కౌంటింగ్ చేయవచ్చన్నారు. దీనివల్ల ఓటరుకు ఉన్న సందేహాలు నివృత్తి అవుతాయన్నారు. అనంతరం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, పంచాయతీ ఈవో సీహెచ్.శ్రీనివాస చంద్రరాజు, టీవోటీ టేకు శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

16న ఢిల్లీలో ధర్నా విజయవంతం చేయాలి



తణుకులో నిరసన చేపట్టిన సీఐటీయూ నాయకులు

తణుకు: గత ఢిల్లీ ఉద్యమంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని పాదయాత్రగా ఢిల్లీ వస్తున్న వారిని ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ అన్నా రు. మంగళవారం పట్టణంలో 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పట్టణాల్లో నిరసనలు చేయాలనే కరపత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మోదీ ప్రభుతానికి అయోధ్య తప్ప ప్రజలు, రైతులు, కార్మికుల సమస్యలు పట్టవని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గార రంగారావు, కె.ముత్యాలరావు, జి.పద్మారావు, కె.రాజశేఖర్, బి.శ్రీను, జి.పాపారావు, పి.సుగుణరావు, యస్.యస్.శ్రీను పాల్గొన్నారు.

దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రైతు సంఘాల సంయుక్త సమితి, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు దేశవ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను ఈ నెల 16వ తేదీన నిర్వహిస్తున్నందున విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొల్ల కోటేశ్వరరావు, ఎస్.శామ్యూల్, జి.నాగేశ్వరరావు, శేఖర్, నవీన్, చిన్నోడు, సామ్యూల్, బి.రామారావు, వెంకట బాబు తదితరులు పాల్గొన్నారు.

15న పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు

భీమవరం: గ్రూప్స్, డీఎస్సీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు యూటీఎఫ్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 15వ తేదీన భీమవరంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ ఒక ప్రకటనలో తెలిపింది. భీమవరంలోని చింతలపాటి బాపిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో విద్యావేత్త, పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు పాల్గొననున్నారు.

దుంప పంటలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



దుంప పంటల మేధోమథన సదస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: దుంప పంటలపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని సీటీసీఆర్ఐ సంచాలకులు డాక్టర్ బైజు గంగాధరన్ కోరారు. కంద పంట సాగు సమస్యలపై వెంకట్రామన్నగూడెం ఉద్యాన పరిశోధన స్థానం, త్రివేండ్రం, కొవ్వూరులలోని దుంప పంటల పరిశోధన కేంద్రాలు సంయుక్తంగా మంగళవారం వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన పరిశోధనా స్థానంలో మేధోమదన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బైజు గంగాధరన్ మాట్లాడుతూ భారతదేశంలో పండే కంద పంట సాగు పరిస్థితులు, కందలో రకాలు, గిరిజన ప్రాంత దుంప పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. ఉద్యానవర్సిటీ ఉపకులపతి డాక్టర్ తెలేటి జానకీరామ్ మాట్లాడుతూ కంద సాగు విస్తరించడానికి ఉన్న అవకాశాలు. పంటలో యాజమాన్య పద్ధతులు గురించి విశదీకరించారు. కందలో విత్తన ఎంపిక, మార్కెటింగ్ పరిస్థితులపై రాష్ట్ర ఉద్యాన ఉప పంచాలకులు వీఎస్.ధర్మరాజు తెలియజేశారు. దుంపపంటల్లో నులిపురుగుల యాజమాన్యంపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవర్సిటీ పరిశోధన సంచాలకులు ఎల్.నారం నాయుడు, విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, అధికారులు డీవి.స్వామి , మల్లికార్జునరావు, వివిధ పరిశోధనా స్థానాలతో పాటు కేరళ, త్రివేండ్రం నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయం భూ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నదాన భవన నిర్మాణానికి దాతలు రూ.2 లక్షలు విరాళం ఇచ్చినట్లు ఈవో మోకా అరుణ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఏలూరు జిల్లా భుజబలపట్నం వాస్తవ్యులు కనుమూరి మురళీకృష్ణంరాజు, సత్యవతి దంపతుల కుమారులు వెంకట సుబ్బరాజు, సీతారామరాజు అన్నదాన భవన నిర్మాణానికి విరాళం అందించినట్లు ఈవో తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రతిమతో సత్కరించారు.